
www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం
16 ఏప్రిల్ 2025


## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రియగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




### పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి ..

'బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది'. అని సీఎం వ్యాఖ్యానించారు.

- మంత్రి వర్గ విస్తరణపై మాట్లాడొద్దని కట్టుదిట్టమైన హెచ్చరిక
- నియోజకవర్గ ప్రాజెక్టులకు సీఎం నుంచి పూర్తి మద్దతు హామీ
- పార్టీ విజయంపై ముఖ్యమంత్రి ఫోకస్
- ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం

2లో

# గీత దాటొద్దు!

ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్నింగ్



4లో

## చట్ట ప్రకారమే భూబదలాయింపులు చేపట్టాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



## అయోధ్యకు బాంబు బెదిరింపు!

లక్నో: అయోధ్య శ్రీ రామ మందిరానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సోమవారం అర్ధరాత్రి వచ్చిన మెయిల్ బెదిరింపుపై మంగళవారం అయోధ్య సైబర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయోధ్య, బారాబంకి, చందౌలీలో భద్రతను పెంచారు. భద్రతను పెంచుకోవాలని హెచ్చరించారు. కాగా.. ఈ బెదిరింపులు తమిళనాడు నుంచి వచ్చినట్లు అధికారులు గుర్తించి మెయిల్స్ పై దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపుల నేపథ్యంలో అయోధ్యలో భద్రతను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. బెదిరింపు మెయిల్ చందౌలీ జిల్లా మేజిస్ట్రేట్ కు వచ్చినట్లుగా అధికారులు వివరించారు. ఈ మెయిల్ ను తమిళనాడు నివాసి గోపాల్ స్వామి అనే వ్యక్తి పంపినట్లుగా గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపు నేపథ్యంలో మేజిస్ట్రేట్ కార్యాలయం, అయోధ్య మందిరం, ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించారు.

3లో

## రాబోయేది బీఆర్ఎస్ 3.0 వెర్షన్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- పసుపు బోర్డుకు అర్వింద్ చట్టబద్ధత తేవాలి





# గీత దాటొద్దు!

## ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్నింగ్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం.. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్ఠానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు' అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేల డుమ్మా కొట్టారు. వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరయ్యా రు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని పిలుపునిచ్చారు.



**శాశ్వత పరిష్కారం..**

'ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం. భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం. ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జఠిలమైన ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. బుధవారం నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతి గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు. ఈ విషయం ప్రజలకు అర్థం అయ్యేలా అవగాహన కల్పించాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.

**జీతం నుంచి రూ.25వేలు పార్టీకి**

ప్రతి ఎమ్మెల్యే జీతం నుంచి రూ.25 వేలు పార్టీకి ఇవ్వాలని సీఎల్పీ నిర్ణయం తీసుకున్నారు. పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తా అంటే కుదరదని, భయపడే పరిస్థితిలో పార్టీ లేదని, అద్దంకి దయాకర్ లాగా ఓపికతో ఉండాలి.. దయాకర్ ఓపికగా ఉన్నాడు కాబట్టి.. ఎమ్మెల్సీ అయ్యాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ఈసీజీ టెక్నీషియన్ ఎవరు?

## ఈసీజీ టెక్నీషియన్ పోస్ట్‌ను ఎందుకు భర్తీ చేయడం లేదు?



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది. గతంలో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే నానుడి నుంచి అన్ని వసతులతో ప్రభుత్వ ఆస్పత్రులు కొనసాగుతునా.. పై అధికారుల అండదండలు ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో అక్రమాలు చోటు చేసుకుంటూ రోగులకు కనీస వైద్యం కూడా అందడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. గతంలో ఇక్కడ ప్రజాప్రతినిధి వారి అనుచరులకు పెద్దపీట వేస్తూ కొందరికి పోస్టింగ్ లు ఇప్పించడం ఔవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకంలో కీలకపాత్ర పోషించడంతో ఈసీజీ టెక్నీషియన్ గా చలామణి అవుతున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది సరిగా విధులు నిర్వహించకుండానే ప్రతి నెల వేతనం పొందుతున్నారని ఇక్కడి సిబ్బందే బహాటంగా చర్చించుకుంటున్నారు. పాలకులు మారిన ఆస్పత్రిపై దృష్టి సారించకపోవడం సలహా మండలిని నియమించకపోవడంతో ఔట్సోర్సింగ్ సిబ్బంది అన్ని విభాగాలలో జోక్యం చేసుకుంటూ విధుల కన్నా పైరవీలే ముఖ్యంగా పని చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. టెక్నీషియన్ సర్టిఫికెట్ లేకుండానే ఔట్సోర్సింగ్ సిబ్బంది ఈసీజీ పేరు మీద విధులు నిర్వహిస్తూ ప్రతినెలా జీతం పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం. ఆస్పత్రిలో పది సంవత్సరాలుగా ఇతను ఈసీజీ టెక్నీషియన్ గా చలామణి అవుతున్న ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి జీతం ఎవరి ఖాతాలోకి వెళ్తుందో నిగ్గు తేల్చాలని ప్రజలకు కోరుతున్నారు.



## భూభారతిపై ప్రచారం చేయాలి

### కలెక్టర్ బి సత్య ప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** భూ భారతి అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం భూ భారతి చట్టం అమలుపై అదనపు కలెక్టర్ బి. ఎస్ లత తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకుని వచ్చిన భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం ప్రజావాణి దరఖాస్తులను ఇంకా నుంచి ప్రతి వారం స్క్రూటినీ చేయడం జరుగుతుందని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టంపై తహసిల్దార్ రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ భూముల ఫెన్సింగ్, మార్కింగ్ ప్రక్రియను తహసిల్దార్ లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మధు సుధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ నుంచి కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎల్లూరుకు చెందిన సువర్ణ ఆశావర్కర్ మల్లికాంతమ్మతో కలిసి హెల్త్ చెకప్ కోసం నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి ఎల్లూరు వెళుతున్న సమయంలో ఆదిరాల సమీపంలో ఆకస్మాత్తుగా పురిటినొప్పులు రావడంతో ఆశా వర్కర్ డెలివరీ చేశారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఆర్టీసీ సిబ్బంది అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.



## అగ్నిమాక వారోత్సవాలు ప్రారంభం

**కలంజ్యోతి, జగిత్యాల :** అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని అగ్నిమాపక అధికారి కృష్ణకాంత్ సూచించారు. జిల్లా కేంద్రంలో జాతీయ అగ్నిమాక వారోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల నివారణపై పలు విన్యాసాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ కరప్రతాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగిత్యాల అగ్నిమాపక అధికారి ఏ కృష్ణకాంత్, ఎల్ ఎఫ్ కే రవీందర్, ఆపరేటర్స్ ఏ మల్లేశం, బి వెంకటేశ్వర్లు, ఏ శంకరయ్య, ఫైర్ మాన్లు పీ సంతోష్, ఎం కార్తీ, జీ శ్రీనివాస్, ఎండీ హకీమ్ పాల్గొన్నారు.



# రాబోయేది బీఆర్ఎస్ 3.0వెర్షన్



**కలంజ్యోతి, నిజామాబాద్ :** రాబోయే బీఆర్ఎస్ 3.o వెర్షన్ అని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు 8+8= జీరో అయ్యిందన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు పైసా ఇవ్వలేదని విమర్శిం చారు. పసుపు బోర్డుకు కూడా పైసా ఇవ్వలేదని ఆరోపించారు. ఎంపీ అర్వింద్ ఇందూరు బిడ్డనే అయితే.. పసుపు బోర్డుకు చట్టబద్ధత తేవాలని డిమాండ్ చేశారు. అన్ని బోర్డులకు పార్లమెంట్ చట్టం చేస్తే.. పసుపు బోర్డ్ గెజిట్ ద్వారా ప్రక టించారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కూడబలుక్కొని దోచుకుంటున్నాయన్నారు. 60 లక్షల మంది ఉన్న పెద్ద కుటుంబం బీఆర్ఎస్ అన్నారు. పార్టీ ప్రారంభమైన ప్రతి ఉద్యమం లక్ష్యం చేరుకోవడం కష్టమన్నారు. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కేసీఆర్‌ను ప్రశంసించారని గుర్తు చేశారు. ఉద్యమంలో అనేక సంక్లిష్టమైన పరిస్థితులను చూశానని.. కేసీఆర్ దీక్ష చేయొద్దని చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్నారన్నారు. కేసీఆర్ బక్క మనిషే అయినా.. మొండి మనిషి అన్నారు. అయితే తెలంగాణ జైత్రయాత్ర.. లేకుంటే కేసీఆర్ శవయాత్ర అని దీక్షకు బయలుదేరారన్నారు. కేసీఆర్ పిలుపునిస్తే ఊరూవాడలు కదిలాయన్నారు. స్వరాష్ట్ర ఉద్యమం ప్రతి సందర్భం స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ కోసం 36 పార్టీలను కేసీఆర్ ఒప్పించారని.. మాయావతిని ఒప్పించేందుకు కేసీఆర్ 50 సార్లు వెళ్లి కలిశారన్నారు. యూపీఏ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు. మళ్లీ 30 ఏళ్లు అధికారంలోకి రారని కాంగ్రెస్ వాళ్లకు తెలుసని.. అందుకే ఇష్టం వచ్చినట్టు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు ఒక అవకాశం ఇచ్చారని.. కాంగ్రెస్ వాళ్లు ప్రజలకు సేవ చేసేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో 20 పర్సెంట్ కమీషన్ అని ఢిల్లీలో చెప్పుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం గురించి అలా మాట్లాడుకుంటే బాధగా అనిపించిందన్నారు.




# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

## కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ 2025, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలుపై సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మండలాల వారిగా, గ్రామాల వారిగా చివరి ఇంటి వరకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, మండలాల వారీగా వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇండ్లు సొంత స్థలంలో దరఖాస్తులు చేసుకున్నావారికి మండల స్పెషల్ ఆఫీసర్లుగా కమిటీ ఏర్పాటులు చేసుకోవాలని పథకం క్రింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సూచించారు. నిధుల విడుదల, పనుల పురోగతి తదితర అంశాలపై కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత, ఆర్డిఓ లు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, మిషన్ భగీరథ, ఈఈ ఏంట్రా రమేష్, హౌసింగ్ డీఈ ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాల అభివృద్దే లక్ష్యం

**కలంజ్యోతి, జగిత్యాల :** మహిళా సంఘాల అభివృద్ధి మా లక్ష్యంగా ముందుండి నడుపుతామని గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల జిల్లా ఐకేపీ సెర్ప్ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ ను, ఎపిడి చరణ్ దాస్ లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లాలో ఐకేపీ సెర్ప్ కార్యక్రమాలు, మహిళా శక్తి కార్యక్రమాల్లో ప్రగతి పథంలో అమలు చేయిస్తూ మహిళ సంఘాల అభివృద్ధి కి పాటు పడటం జరుగుతుందని, ఇలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా అదే స్ఫూర్తి తో విజయవంతం చేస్తామని, అలాగే ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మండల, గ్రామ సిబ్బంది తో కలిసి ఇబ్బందులు లేకుండా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సేర్ఫ్ యూనియన్ అధ్యక్షులు కోల. చక్రవర్తి, ఉపాధ్యక్షులు ఆనం. శంకర్, ప్రధాన కార్యదర్శి పోతు నరహరి, సహాయ కార్యదర్శి దొంతుల. సమత, కోశాధికారి యాచమనేని. రమాదేవి, గౌరవ అధ్యక్షులు వోదెల. గంగాధర్, సలహాదారులు జి. సి. రాజయ్య, ఆర్. చంద్రకళ ఆయా మండలాల ఏపియం లు తదితరులు పాల్గొన్నారు.



# రహీంఖాన్ పేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కర్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నారెడ్డిపల్లె, తాళ్లపల్లి, గాలిపల్లి, జవారిపేట, కొత్తూరు, కందికట్కూర్, కృష్ణరావుపల్లె, రంగంపేట, వల్లంపట్ల, ఓబులాపూర్, గూడపల్లి, రహీంఖాన్ పేట, ముస్కాన్ పేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్ ప్రారంభమంచారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు కోమటిరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీరేశం, మచ్చ రాజేశం, ఐరెడ్డి సురేందర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకట్ రెడ్డి, తిరుపతిగౌడ్, రాంప్రసాద్, సత్యారెడ్డి, వెలిశాల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత



**కలంజ్యోతి, జగిత్యాల :** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నేడు జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండగా బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ రజతోత్సవ సన్నాహక సమావేశానికి హాజరై పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు కవిత దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి జగిత్యాల నియోజకవర్గం బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు వెల్లడించారు.

# చట్ట ప్రకారమే భూబదలాయింపులు చేపట్టాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలోనే మంజూరు చేసి, అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ భూముల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ప్రాజెక్టులు, పంచాయతీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర, రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీ శాఖ రెవెన్యూ, విద్యుత్, ఇంజనీరింగ్ శాఖలతో సమన్వయంగా పని చేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎఫ్ఓ నాగినిభాను, ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, తహసీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్

**కలంజ్యోతి, జగిత్యాల :** రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేసి కనీస మద్దతు ధర పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ తెలిపారు. జగిత్యాల మండలంలోని నర్సింగాపూర్, వెల్దుర్తి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 133 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. వంజరిపల్లి, జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో స్థానిక అధికారులచే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం వి.గంగాధర్, సీసీ మరియా, ప్రజాప్రతినిధులు మహేష్, మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లేశం గౌడ్, నరేష్, ప్రవీణ్ గౌడ్, ప్రకాష్, మమత, దివ్య, జాముని, లక్ష్మి పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.20.19 కోట్లు విడుదల

- సీఎం రేవంత్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ
- ఇళ్ల పథకం కింద తొలి విడత నిధుల పంపిణీ
- లబ్ధిదారులకు మొబైల్ యాప్ ద్వారా డైరెక్ట్ బెనిఫిట్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల కలను సాకారం చేసే దిశగా మరో అడుగు వేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో భాగంగా , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం 12 మంది లబ్ధిదారులకు లాంఛనంగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 20.19 కోట్లను 2,019 మంది లబ్ధిదారులకు విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతలో 70,122 ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం, ఇందులో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న 2,019 మందికి ఈ నిధులను అందించింది. ఇప్పటివరకు 13,500 ఇళ్లు గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నాయి. ఈ పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు అనే కలను సులభతరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని తెలిపారు. 'బేస్‌మెంట్, గోడలు లేదా శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. మీరే ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, డబ్బులు నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి,' అని ఆయన హామీ ఇచ్చారు. ఈ వినూత్న విధానం లబ్ధిదారులకు సమయం ఆదా చేయడమే కాక, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేస్తుందని అంటున్నారు. ఇళ్ల నిర్మాణం విషయంలో కొన్ని మార్గదర్శకాలను కూడా మంత్రి వివరించారు. 'లబ్ధిదారులు కనీసం 400 చదరపు అడుగులు, గరిష్టంగా 600 చదరపు అడుగుల లోపు ఇంటిని నిర్మించుకోవాలి. ఇది లబ్ధిదారులకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన గృహాలను అందించడంలో సహాయ పడుతుంది,' అని పొంగులేటి తెలిపారు.

# భూ భారతిలో అప్పీలు వ్యవస్థ



**కలంజ్యోతి, జగిత్యాల :** భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా 2025 ఏప్రిల్ 14న ప్రారంభించిన భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల అసోసియేషన్ జగిత్యాల మాజీ అధ్యక్షుడు, న్యాయవాది హరి ఆశోక్ కుమార్ ప్రజల సమాచారం కోసం తెలిపారు. తహశీల్దార్లు జారీచేసే పాస్ పుస్తకాల్లో లేదా భూదార్ పై ప్రజాలకు ఏమైనా అభ్యంతరాలుంటే రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టంలో సెక్షన్ 15, నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ కు రెండో దశలో అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్డీవో చేసిన మ్యుటేషన్లపై లేదా ఆర్డీవో చేసిన సాదాబైనామాల క్రమబద్ధీకరణపై ఎవరికయినా అభ్యంతరాలుంటే కలెక్టర్ కు అప్పీలు చేసుకునేందుకు వీలుంది. కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే భూమి ట్రిబ్యునల్ లో అప్పీలు చేసుకోవచ్చు. ఇలా అప్పీలు చేసుకునేందుకు వ్యవస్థ ధరణి చట్టంలో అవకాశం లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భాదితులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ ప్రధాన లోపాన్ని సవరిస్తూ భూ భారతి చట్టంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పీలు వ్యవస్థ కు అవకాశం కల్పించినట్లు హరి ఆశోక్ కుమార్ వివరించారు.

# టిప్పర్ ఢీకొని బాలుడు మృతి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండలం పుల్లయ్య బోడు తండా ఎక్స్ రోడ్డు వద్ద టిప్పర్ ఢీకొనడంతో బాలుడు మృతి చెందాడు. భూక్య వెంకన్న పద్మ దంపతుల కుమారుడు భూక్య ప్రవీణ్ (10) కళ్ల ముందు తమ కొడుకు విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రాజేష్ రెడ్డి, తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు.



# దశాబ్దాల నుంచి కాంగ్రెస్ కోసం పనిచేశా

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



**కలంజ్యోతి, జగిత్యాల :** దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్ట కాలంలో శాసన మండలిలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం గళం వినిపించమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. 'పార్టీ మారుతారని ఎలా అంటారు. కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి జీవన్ రెడ్డి' అని పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోందని విలేకరులు అడిగిన ప్రశ్నకు జీవన్ రెడ్డి స్పందించారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన నేను 'కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి.. జీవన్ రెడ్డి అంటేనే కాంగ్రెస్ మీరు వేరేలా ఎలా ఆలోచిస్తున్నారు' అని ప్రశ్నించారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న.. దశాబ్దకాలం ఒంటరిగా పోరాటం చేసిన తాను 2014లో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేశానని పేర్కొన్నారు. 2019 లో దశాబ్ద కాలం శాసన మండలి లో ఏకైక కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేశామని గుర్తు చేశారు. పార్టీలో తన సీనియారిటీకి స్థానం ఏమిటి అనే భావన తనలోనూ ఉందన్నారు. దేశంలో నూతన సంవత్సరంలో మొదటిసారిగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. సన్నబియ్యం పంపిణీతో దళారీ వ్యవస్థ కనుమరుగు అయిందన్నారు. భూ భారతి చట్టంతో పారదర్శకత ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బలహీన వర్గాలకు ఏకగ్రీవంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేశారు. ప్రభుత్వంతో పాటు వివిధ రాజకీయ పార్టీలు కూడా బాధ్యతగా భావించాలని, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వెనకబాటు తనాన్ని పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్ లేని కులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించి, అమలు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి లేనిపక్షంలో ఆర్డినెన్స్ జారీ చేసి 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించి 9 వ షెడ్యూల్ లో చేర్చాలని ఆకాంక్షిస్తున్న.. ప్రధానమంత్రి మోదీ చొరవ తీసుకొని రిజర్వేషన్ బిల్లు ఆమోదింపచేయాలన్నారు.



# కొండగట్టులో చాలీసా పారాయణం

కలంజ్యోతి, మల్యాల : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం స్వామికి ప్రీతికరమైన రోజు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో సందడి నెలకొంది. చిన్న జయంతికి దీక్ష స్వాములతో సందడిగా ఉన్న కొండగట్టు భక్తులతో నిండిపోయింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు తలనీలాలు సమర్పించి, పుష్కరినిలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి క్యూ లైన్లో వెళ్లారు. స్వామి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తూ బయటకు వచ్చారు. ఉప ఆలయాలు రామాలయ, బేతల గుడిలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోదావరిఖనికి చెందిన గురుచరిత ట్రస్ట్ సభ్యులు ఆలయ ముందు భాగంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పఠించారు.



Cinema కలంజ్యోతి
బుధవారం 16.04.2025

# ఇది మీకు నచ్చుతుంది



హీరోయిన్ కృతి శెట్టి ‘ఉప్పెన’ సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇక ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ , బంగారాజు, వంటి చిత్రాల్లో నటించి హిట్స్ తన ఖాతాలో వేసుకుని పాపులారిటీ పెంచుకుంది. ప్రస్తుతం కృతిశెట్టి వా వాతియార్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ వంటి చిత్రాలతో ప్రేక్షకుల రాబోతుంది. ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ సినిమాలో ఇటీవల ‘డ్రాగన్’ హిట్ సాధించిన ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తుండటం విశేషం. అయితే ఈ మూవీని నయనతార భర్త కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా, కృతి శెట్టి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ వీడియోను షేర్ చేస్తూ గుడ్ న్యూస్ ప్రకటించింది. ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ సినిమా షూటింగ్ పూర్తి అయినట్లు తెలుపుతూ ప్రదీప్, విఘ్నేష్ తో పాటు మూవీ టీమ్ అందరితో కలిసి కనిపించింది. అలాగే మా చిత్రం మీకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.. మిమ్మల్ని ప్రేమిస్తున్నాం అని తెలిపింది.

